క్లుప్తంగా

సాంబశివరావు సేవలు మరవరానివి



తెనాలిఅర్బన్: మాజీ కౌన్సిలర్ సూర్యదేవర సాంబ శివరావు సేవలు మరువరానివని రేపల్లె మున్సిపల్ కమిషనర్ విజయ సారథి పేర్కొన్నారు. సాంబ శివరావు 16వ వర్ధంతిని పురస్కరించుకుని చినరావూరులోని స్మారక స్థూపానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి, మాజీ కౌన్సిలర్ సూర్యదేవర శశికళ, గాలి రవి కుమార్, ఎన్టీఆర్ జగన్, వాసిరెడ్డి శ్రీనివాస రావు, ప్రభాకర్, విజయలక్ష్మి, డి.శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల జీవితాలకు భరోసా కల్పించండి



తెనాలిఅర్బన్: కొందరు కళాకారుల జీవితం దుర్భరంగా ఉందని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. పెదరావూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద కళాకారుల కోసం ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ఆయా రాజకీయ పార్టీల విధి విధానాలను ఎన్నికల మేని ఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పెదపులివర్రులో ఉచిత కంటి వైద్య శిబిరం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పేస్ సొసైటీ, సందీప్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నీలా ఉషారాణి ప్రారంభించారు. 82 మందికి కంటి పరీక్షలు చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి తక్కువ ధరకు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, హెల్త్ డబ్ల్యూఎస్ అధ్యక్షుడు బి.బాబు రావు, సచివాలయ కార్యదర్శి ఎస్.రాజశేఖర రెడ్డి, వీఆర్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ



బాపట్ల అర్బన్: వృత్తి పనులు చేసుకుంటూ జీవిస్తున్న పలువురికి ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల పట్టణ ప్రతి నిధులు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. క్లబ్ బాపట్ల అధ్యక్షుడు ఆలపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ దిగువ మధ్య తరగతి కుటుంబాలకు తమ క్లబ్ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందజేసేందుకు ముందుంటుందన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు బూర్గుల సంగమేశ్వర శాస్త్రి , గోపాలం రఘుపతిరావు, కోశాధికారి వంకాయలపాటి హరిబాబు, తోదేటి రజనీకాంత్ పాల్గొన్నారు.

'సినడు' వైస్ ప్రెసిడెంట్‌కి సన్మానం



భట్టిప్రోలు: ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి(ఏఈఎల్‌సీ) తూర్పు గుంటూరు 'సినడు' కి వైస్ ప్రెసిడెంట్‌గా భట్టిప్రోలు క్రీస్తు లూథరన్ దేవాలయం పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ ఎన్నిక ఎన్నికయ్యారు. స్థానిక సంఘస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం చర్చిలో రవీంద్రవర్మ దంపతులను సంఘ పెద్దలు, సంఘస్తులు, స్త్రీల సమాజం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: నగరంలోని కొత్తపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేటకు చెందిన కాలేషావలి తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. కొద్ది సేపటి అనంతరం బయటకు రాగా తాను పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైంది, దీంతో చోరీకి గురైందని భావించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుతూ..పాడుతూ..!

- చిన్నారులకు అక్షర అభ్యాసం
- నూతన రూపు రేఖలతో అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారుల్లో పఠనాసక్తికి వినూత్న విధానం
- ప్రతి కేంద్రంలో బొమ్మల కొలువు
- సులభమైన పద్ధతిలో విద్యాబోధన



చిన్నారులకు ఆటపాటలతో బోధిస్తున్న కార్యకర్త సంతోషకుమారి

కొల్లిపర: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల వయస్సు మూడు నుంచి ఐదేళ్లు ఉంటుంది. వీరికి విద్యా బోధన అంటే దృశ్య రూపకంగా, ఆటవిడుపుగా ఉండాలి. మొదట బొమ్మలతో బోధిస్తూ.. చదువు, ఆటలపై ఆసక్తి కల్గించాలి. పాఠ్యాంశాల్లోని వస్తువులను ప్రత్యక్షంగా చూపించి, వాటి పేర్లు చెప్పించడం ద్వారా విజ్ఞానం పెంచాలి. చిన్నారుల్లో సృజనాత్మకత, అభ్యసన నైపుణ్యం పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట వస్తువులు, బొమ్మల కొలువులు ద్వారా ఆడుతూ..పాడుతూ..కార్యకర్తలు బోధన చేస్తున్నారు.

కొల్లిపర మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల్లో మేధా శక్తి పెంచేందుకు వినూత్నంగా బోధిస్తున్నారు. అంగన్‌వాడీ భవనం లోపలి గోడలపై చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా రంగు రంగుల బొమ్మలు, ఆట వస్తువుల చిత్రాలు తీర్చిదిద్దుతున్నారు. వీటి ద్వారా పిల్లలకు కార్పొరేట్ కాన్వెంట్లు, ప్రీ స్కూళ్లకు దీటుగా.. సులభంగా, అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

చిత్రలేఖనంతో మేధో శక్తి

చిత్రలేఖనం పుస్తకాలను మూడేళ్ల పిల్లలకు అంగన్‌వాడీల్లో ఇస్తారు. ఇందులో గీసి ఉన్న ఆకారాలపై రంగులు వేయిస్తారు. వర్క్ పుస్తకాల్లో అక్షరాలు రాయిస్తారు. దీని వల్ల చిన్న చిన్న పదాలను రాయడం, చదవడం చిన్నారులకు అలవాటు అవుతుంది.



ఆట వస్తువులు, బొమ్మల కొలువు

వివిధ ఆకారాల్లో ప్లాస్టిక్ బీడ్స్, వృత్తం, త్రికోణం, చతురస్రం వివిధ రంగుల్లో ఉంటాయి. ఇవి చిన్నవి, పెద్దవి ఉంటాయి. రంగులు గుర్తించి, వాటిని వేరు చేయడం వల్ల పిల్లల్లో పరిశీలన ఆసక్తి పెరుగుతుంది. గోడలపై రంగులతో రాసిన అక్షరమాల, ఏబీసీడీలు, కూరగాయలు, అంకెలు చిన్నారుల్లో అవేంటో తెలుసుకోవాలన్న ఆసక్తిని పెంచుతాయి.

ఆట వస్తువులతో విద్యాబోధన



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 'నాడు–నేడు' ద్వారా చర్యలు తీసుకున్నారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు సృజనాత్మకత, మేధోశక్తి పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బొమ్మల కొలువుగా తీర్చిదిద్దారు. బొమ్మలతో బోధించడంతో చిన్నారులు ఎంతో ఆసక్తిగా వింటున్నారు. ఈ పద్ధతిలో పిల్లలు పాఠాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు. గతంలో కన్న ఇప్పుడు చిన్నారుల హాజరు శాతం పెరిగింది.

– బి.సంతోషకుమారి, దావులూరు అంగన్‌వాడీ 2 కార్యకర్త.

కిడ్నీ బాధితులు తగు జాగ్రత్తలు పాటించాలి



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టరు శ్రీనివాస్‌మారెడ్డి, డాక్టరు కోటి నీరజ

కొల్లిపర: కిడ్నీ వ్యాధితో బాధపడే రోగులు తగు జాగ్రత్తలు పాటిస్తూ, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టరు శ్రీనివాస్‌మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆరిమండవారి కల్యాణ మండపంలో గుంటూరులోని సురక్ష హాస్పిటల్, నీరజ న్యూరో కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టరు శ్రీనివాసరెడ్డి కిడ్నీ రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ రోగులు వైద్యుల సలహాలు, సూచనలు తప్పని సరిగా పాటిస్తే వ్యాధి నుంచి త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి వ్యక్తి ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. డాక్టరు కోటి నీరజ మాట్లాడుతూ పక్షవాతం, వెన్నుపూస నొప్పి, నిత్యం తల తిరగడం వంటి లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం తీసుకోవాలన్నారు. అనంతరం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల మోహన్‌రెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఎ.బసవ కుటుంబరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరవరానివి



గాయకుడు సుధాకర్, ప్రవీణ్‌కుమార్, భావనా చౌదరిలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ సేవలు మరవరానివని బొప్పర ప్రవీణ్ కుమార్, గుమ్మడి భావన చౌదరిలు పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్ అసోసియేషన్ హాల్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. బహుజనుల కోసం ఎన్టీఆర్ తీసుకువచ్చిన సంస్కరణలపై వారు ప్రసంగించారు. అనంతరం ప్రముఖ గాయకుడు మామిడి వెంకట సుధాకర్‌తో పాటు వక్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, శ్రీకరరావు, ఉప్పు సత్యనారాయణ, పరుచూరి రమ్య, సత్యవతి, సుజాత, సరోజాలక్ష్మి, నాగమణి, గుమ్మడి వాణి, కంచర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నాటక రంగస్థల దినోత్సవం



తిరుమలయ్యను సత్కరిస్తున్న సాయి లక్కరాజు



వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పించిన కళా ప్రముఖులు

తెనాలిటౌన్: స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయంలో తెలుగు నాటక రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. సభకు సాయి లక్కరాజు అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొన్నపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. సర్వకళల సమాహారం నాటకమన్నారు. కందుకూరి వీరేశలింగం జయంతిని 2007 నుంచి నాటక రంగ దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. నాటక రంగానికి సేవలు అందిస్తున్న తిరుమలయ్యను సత్కరించుకోవడం నాటక రంగానికే సత్కారమన్నారు. కార్యక్రమంలో నటులు హేమంత్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, సురేష్, అఖిల్ పాల్గొన్నారు.

అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో..

తెనాలి: పట్టణానికి చెందిన అభ్యుదయ కళా సమితి, ఇస్కఫ్ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని నిర్వహించారు. గాంధీ నగర్లోని బొల్లిముంత ఫౌండేషన్ హాలులో జరిగిన సభకు పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకుడు బీవీ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గాయకుడు సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఎన్‌సీసీ అధికారి బెల్లంకొండ వెంకట్, ఇస్కఫ్ రాష్ట్ర నాయకురాలు బెజ్జంకి నాగమణి, కార్యదర్శి శ్రీదేవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గురుబ్రహ్మం, బొల్లిముంత కృష్ణ, చందు సూర్య, మునిపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. తొలుత కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ స్పందన



బుక్‌లెట్ అందిస్తున్న కౌన్సిలర్ అనిల్



ప్రజా మద్దతు కోరుతున్న కౌన్సిలర్ మొగల్ అహ్మత్ బేగ్



కరపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ దుబాయ్‌బాబు

తెనాలిఅర్బన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి తెనాలిలో ఆదివారం అపూర్వ స్పందన లభించింది. పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. అలాగే వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 28, 33, 22 వార్డుల్లో కౌన్సిలర్లు యాతాటి అనిల్, మొగల్ అహ్మద్ బేగ్, షేక్ దుబాయ్ బాబు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ప్రభుత్వం సంక్షేమాన్ని లబ్ధిని వివరించారు. 32వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుడు మట్లపూడి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బుక్‌లెట్‌లు అందజేశారు.

ప్రజా సంక్షేమం పట్టని కేంద్ర ప్రభుత్వం



భట్టిప్రోలు: ప్రజల సంక్షేమం వదిలేసి, అంబానీ, అదానీల ఆస్తులను పెంచే పనిలో ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు ఆరోపించారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30 వరకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తలపెట్టిన ప్రచార భేరీ యాత్రను భట్టిప్రోలులో ఆదివారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. నాగాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు జి.బాలాజీ, నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాస రావు, ఐఏఎల్ శాఖ కార్యదర్శి జి.దుర్గ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరావు, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



సిలిండర్ నుంచి మంటలను ఆర్పేందుకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెనాలిరూరల్: వారోత్సవాల్లో భాగంగా తెనాలి అగ్నిమాపక, విపత్తు స్పందన శాఖ అధికారులు, సిబ్బంది పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మూడో రోజు అపార్ట్‌మెంట్ వాసులకు అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు తెలియజేశారు. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని కైలాష్ అపార్ట్‌మెంట్‌లో ఈ మేరకు సిలిండర్ల నుంచి మంటలు చెలరేగితే అదుపుచేసే విధానాన్ని ప్రదర్శించారు. తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపకాధికారి కె.కృష్ణారెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక బృందం అవగాహన కల్పించారు.

నాలుగు దశాబ్దాల స్నేహ బంధం



యాజలి(కర్లపాలెం): నాలుగు దశాబ్దాల స్నేహాన్ని మళ్లీ పలకరించేందుకు..ఆత్మీయ సమ్మేళనంతో ఆ పూర్వ విద్యార్థులు ఒక్కటయ్యారు. 1983–84, 1984–85లో 10వ తరగతి చదువు నేర్చిన వారు యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. తమ స్నేహితులను, గురువులను చూసేందుకు కుటుంబ సభ్యులతో సహా విచ్చేశారు. పాఠశాల హెచ్‌ఎం జి.రమాదేవి అధ్యక్షతన ఈ సమావేశం అత్యంత ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. తమకు చదువు నేర్పిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దెందులూరి కృష్ణంరాజును పూలమాలలతో, పట్టు వస్త్రాలు, వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించి ఘనంగా సన్మానించి, మురిసిపోయారు. తమ గురువుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఇంటిలిజెన్స్ డీఎస్పీ యంపరాల శ్రీనివాస రావు, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పాల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ డేవిడ్, వీఎస్ఆర్ ఎస్టేట్స్ అధినేత జి.బ్రహ్మయ్య, పాస్టర్ లాబా నురాజు, విజయభాస్కర్, స్వామిరెడ్డి, మల్లికార్జునరావు, సూర్యనారాయణ శర్మ, బేసా బత్తుని వెంకటేశ్వర్లులు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న రమణయ్య



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

తెనాలిటౌన్: బోసు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఎం.రమణయ్య, సామ్రాజ్యం దంపతుల సహకారంతో మజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు ఆదివారం దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో అనూష, తల్లిమిల్లి పోతురాజు, సభ్యులు పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్: రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఐతా నగర్‌లోని రజక చెరువు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గౌరవ అధ్యక్షుడు వీర్లపాటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోతర్లంక ప్రసాద్, ట్రెజరర్ పోతర్లంక శ్రీనివాస్, నాయకులు ఫణీదెప్పు దుర్గా, టి.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాస రావు, శివనాగేశ్వరరావు, శివరామకృష్ణ, సూరి బాబు, గోపి పాల్గొన్నారు.

మురిసిన గోల్డెన్ జూబ్లీ స్నేహం..



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పెదపులివర్రు(భట్టిప్రోలు): స్నేహ బంధం ఎంత మధురం.. కరిగిపోదు జీవితాంతం.. అన్న ఓ కవి భావన ఇలాంటి పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనాన్ని చూసినప్పుడు అక్షరసత్యమనిపిస్తుంది. పెదపులివర్రులోని గుత్తా సుబ్బరాయ చౌదరి జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా..ఆదివారం పాఠశాలలో 1972–1973 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఐదు దశాబ్దాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగారు. ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు. బాల్య జ్ఞాపకాలను, మధురానుభూతులను గుర్తు చేసుకుని మళ్లీ చిన్న పిల్లలయ్యారు. వివిధ హోదాల్లో స్థిరపడిన వారు.. సార్, మేడమ్ అన్న పలకరింపులకు విరామం ఇస్తూ.. ఏరా..ఏమె.. ఎలా ఉన్నావు, ఏం చేస్తున్నావు.. అన్న ఆత్మీయ పలకరింపులతో మునిగిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో గడిపి అక్కడి బరువెక్కిన హృదయాలతో తిగిరి వెళ్లారు. స్నేహితులందరినీ.. ఒకచోట కలిపేందుకు గుత్తా కట్టయ్య చౌదరి, గుత్తా రంగారావు(బోస్), సుంకర సంగమేశ్వరరావు, దేవినేని చలపతిరావు, జి.ప్రభు కుమార్ కృషి చేశారు. తమ బ్యాచ్‌లో 51 మంది విద్యార్థులకు గాను 33 మందికి పైగా కుటుంబ సమేతంగా హాజరయ్యారని వారు తెలిపారు. నాటి గురువులు ఎస్.భారతి దేవి (సైన్స్), బి.శక్తి కుమారి(సైన్స్), యు.రంగవర్ధిని (హిందీ పండిట్), కోగంటి చిదంబరరావు(ఎన్‌డీఎస్)ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా స్త్రీల ఆదివారం



ఏఈఎల్‌సీ చర్చిలో నిర్వహించిన ఆరాధనలో పాల్గొన్న స్త్రీలు

భట్టిప్రోలు: స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో ఆదివారం స్త్రీల ఘనంగా నిర్వహించారు. స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయంలో స్త్రీల సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టరమ్మ దాసరి విజయ దేవునికి మహిమకరంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఆరాధనలో డాక్టర్ పులిపాక రాణి వాక్య సందేశాన్ని అందిస్తూ స్త్రీల ఆదివారం అంటే ఈస్టర్ పండుగ తరువాత వచ్చే మెదటి ఆదివారమని తెలిపారు. ఏసు క్రీస్తు పునరుత్థానుడై వచ్చినపుడు స్త్రీలను చూశారని... అందుకే ఆయన గౌరవార్థం స్త్రీల ఆదివారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం యూత్ చిల్డ్రన్స్, సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు రక్షకుని దేవాలయం వార్షికోత్సవం

భట్టిప్రోలు క్రీస్తు రక్షకుని దేవాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ తుమ్మా జయపాల్ (కౌన్సిలర్ ఆఫ్ యూత్ అండ్ ఒకేషన్స్ ప్రోవైన్సీ –బెంగుళూర్) రెవరెండ్ కొమ్మారెడ్డి ప్రభాకర్ (ఖమ్మం డయాసిస్)లు విచ్చేసి తమ సందేశాలను అందించారు. విచారణ గురువు రవి కుమార్, సహాయక గురువులు జయ రాజ్, మార్టిన్ పాల్గొన్నారు. సామూహిక సహ భోజనాలు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి



ప్రజారోగ్య వేదిక రాష్ట్ర సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మంగళగిరి: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి పాలక పార్టీలు కృషి చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్ అన్నారు. నగరంలోని గోపాలకృష్ణ థియేటర్ సమీపంలోని ఆస్పత్రిలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర సావనీర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం గురించి పాలక పార్టీలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్య రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. మంగళగిరి డివిజన్ నాయకులు డాక్టర్ వంశీ కృష్ణ, విజయ్, ఎం.నాగేశ్వరరావు, రాజేష్, జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, పి.బాలకృష్ణ, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

పొన్నెకల్లులో చైన్ స్నాచింగ్

తాడికొండ: తెల్లవారుజామున గేదెల కొట్టం వద్దకు వెళుతున్న మహిళ మెడలో చైన్ లాక్కొని పరారైన ఘటన పొన్నెకల్లులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కోటా సామ్రాజ్యం(70) తెల్లవారుజామున 5 గంటలకు గేదెల కొట్టం వద్దకు నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు పొన్నెకల్లు సెంటర్‌కు దారి ఎటు వెళ్లాలని అడిగి అడ్రస్ తెలుసుకొన్న అనంతరం మహిళ మెడలో ఉన్న రెండు పేటల నాను తాడుని లాక్కొని పరారయ్యారు. దొంగిలించిన తాడు 40 గ్రాములు అని, విలువ రూ. 40 వేలు ఉంటుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చారు. ఉదయాన్నే కడప, ఆళ్లగడ్డ, అనంతపురం, రాజోలు, వెంకటాయపాలెం ప్రాంతాలను రైల్లు, వాహనాల్లో భక్తులు వచ్చి కొండ ఎక్కారు. తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు.